క్లుప్తంగా

సన్మానం



నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరుకు వచ్చిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావాను బీజేపీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని శాలువాతో సత్కరించారు. బీజేపీ నాయకులు బైరి శ్రీనివాస్, పరుసు వెంకటేశ్వర్లు, పరుసు మధు, నటుకుల కిషోర్‌కుమార్, జరుగుమల్లి జయకుమార్, గుర్రం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మనుబోలు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికీకరణ నేపథ్యంలో నానాటికి పచ్చదనం తగ్గిపోయి వాతావరణ కాలుష్యం ఎక్కువ అవుతోందన్నారు. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక బాధ్యత కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీడీ వేణుగోపాల్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మండలంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు ముందుగా వెంకయ్య స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకయ్య స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఎస్ ప్రసాద్ జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వెంకయ్యనాయుడును కలిసిన చవటపాళెం రైతులు



వెంకటాచలం: మండలంలోని చవటపాళేనికి చెందిన రైతులు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం ఉదయం కలిశారు. చవటపాళెంలో ఎన్‌సీఈఆర్‌టీ సంస్థ ఏర్పాటుకు సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం ఇంకా తమకు అందలేదని, పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు. స్పందించిన వెంకయ్యనాయుడు జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫ్యామిలీడాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్య కోరారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ కావ్య రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలపై ఏమైనా సందేహాలుంటే గ్రామానికి వైద్యులు వచ్చినప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులువుగా నయం చేసుకోవచ్చని తెలిపారు. ఆరోగ్య సమస్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. శస్త్రచికిత్స అవసరమైనా వైద్యసిబ్బందే చొరవ చూపి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరోజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని సహకార సంఘాల బలోపేతానికి సిబ్బంది కృషి చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు కోరారు. అంతర్జాతీయ 102వ సహకార దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని సహకార బ్యాంకులు, సహకార సంఘాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో సిబ్బంది సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సహకార గీతాన్ని ఆలపించి సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో 12 శాతం మంది సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు. సహకార సంస్థ ద్వారా ప్రపంచంలోని 260 మిలియన్ల మంది జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఈ ఏడాది అంతర్జాతీయ సహకార సమాఖ్య 'సర్వ మానవాళికు మెరుగైన భవిష్యత్తు నిర్మాణానికి సహకార సంఘాలు' అనే నినాదంతో సహకార దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలకు ఆర్థిక, సామాజిక సాధికారత కల్పించడమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమన్నారు. సహకార సంఘాల సిబ్బంది నీతి, నిజాయతీ, అకింతభావంతో విధులు నిర్వహించి సహకార సంఘాలను పటిష్టం చేయాలని కోరారు. సమాజంలోని అన్ని రంగాల ప్రజలకు ప్రయోజనం కలిగించే సహకార వ్యవస్థ ఎంతో గొప్పదని, జిల్లా సహకార బ్యాంకు ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ జిల్లాలో చేనేత సహకార సంఘాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, డీసీసీబీ జనరల్ మేనేజర్ సరిత, డీజీఎం ఉషారాణి, సహకార శాఖ విద్యాధికారి గోగుల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీసీసీబీలో సహకార ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

డీసీఎమ్మెస్ కార్యాలయంలో..

స్టోన్‌హౌస్‌పేటలోని డీసీఎమ్మెస్ కార్యాలయ భవనంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది సహకార పతాకాన్ని ఎగురవేసి సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డీసీఎమ్మెస్ కార్యాలయంలో సహకార పతాక ఆవిష్కరణ

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆదేశానుసారం నెల్లూరుటౌన్ డివిజన్‌కు సంబంధించి ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విద్యుత్‌భవన్‌లోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్‌భవన్‌లోని స్కాడా బిల్డింగ్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని చెప్పారు. వినియోగదారుల పరిష్కార వేదిక అధ్యక్షుడు వీ శ్రీనివాసఆంజనేయ మూర్తి(రిటైర్డ్ జడ్జి), ఆర్థిక సభ్యులు కే రామ్‌మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు జీ ఈశ్వరమ్మ, విద్యుత్ అధికారులు హాజరవుతారని తెలిపారు. నగరానికి చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఉడ్‌కాంప్లెక్స్ విద్యుత్ ఫీడర్‌లో విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉడ్ కాంప్లెక్స్ ప్రాంతం, డ్రైవర్స్‌కాలనీ, విక్రమ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గోషా ఆస్పత్రిని నిర్మించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పాతమున్సిపల్ కార్యాలయం వద్ద గోషా ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో గోషా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రాంతంలో సీపీఐ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ గోషా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి నెల్లూరు మహిళలకు కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకులు అజీజ్ అహ్మద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్, సర్దార్, లతీఫ్‌అహ్మద్, రియాజ్, గౌస్‌బాషా, వెంకటేశ్వర్లు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ఉపప్రధానమంత్రిగా బాబుజగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు ఎనలేనివని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్యమాదిగ కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ఆయన విగ్రహానికి సీమాంధ్ర ఎమ్మార్పీస్ నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు, వెంకటరమణయ్య, రియజ్, తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న సీమాంధ్ర ఎమ్మార్పీస్ నాయకులు

మంత్రి ఆనంను కలిసిన నాయిబ్రాహ్మణ ఉద్యోగులు



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా నాయిబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సంఘ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి ఆర్ ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులు వల్లూరు బాలకేశవులు, వరికుంట్ల హజరత్తయ్య, ఎం పుల్లయ్య, ఎం సాయిబాబా, పొనుగూరు గోపాలకృష్ణయ్య, దోర్నాల హరిబాబు, ఏ సుధాకరయ్య, కోసూరు అశోక్, వాశిలి మల్లికార్జున, నాగేంద్రప్రసాద్, డాక్టర్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలులో నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు..గాంధీనగర్‌లో సలీం కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన గూడూరులో కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు నసీర్(22) నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం సాయంత్రం నాయుడుపేట నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో నెల్లూరుకు బయలుదేరారు. వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి ప్లాట్‌ఫామ్‌పై జారిపడ్డాడు. తలకు తీవ్రగాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జీ మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.



నసీర్ మృతదేహం

జేసీని కలిసిన కందుకూరు ఎమ్మెల్యే



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జేసీను శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి

కొడవలూరు: పాఠశాలల అభివృద్ధికి అడ్డుగా ఉన్న జీఓ నంబర్ 117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను శనివారం వారు కలుసుకుని యూటీఎఫ్ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాచర్లపాడులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, కార్యదర్శి ఎస్కే ఖాజావలి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల రెండింటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని కోరారు. యూడైస్ ప్లస్ పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మాలకొండయ్య, పీ తిరుపాలు, సభ్యులు జమీర్‌అహ్మద్, సీహెచ్.శ్రీహరి, షేక్ గౌస్‌బాషా, ఏ కీర్తన, ఆర్ శైలజ, జీ నాగభూషణం, డీ ప్రభాకర్, ఏ పుట్టయ్య, టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రాచర్లపాడులో ఉపాధ్యాయులకు యూటీఎఫ్ సభ్యత్వాన్ని అందజేస్తున్న నేతలు

పొదలకూరులో 56.4 మి.మీ వర్షపాతం

పొదలకూరు: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని వర్షం పడింది. వర్షంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలు ఉపశమనం పొందారు. కా గా మండలంలో 56.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడికి వినతి

నెల్లూరు(బారకాసు): సఫాయి కార్మికుల సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సింహపురి చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాబీభగత్, జిల్లా అధ్యక్షుడు అమృత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం నెల్లూరుకు వచ్చిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావను కార్పొరేషన్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది తుఫాన్ కారణంగా కార్పొరేషన్ పరిధిలోని మాగుంటలేఅవుట్ ప్రాంతంలోని డ్రైనేజీలో గ్లౌజులు, బూట్లు, హెల్మెట్లు, తదితరాలు లేకుండానే పారిశుధ్య కార్మికులతో పనిచేయించారని తెలిపారు. ఈ అంశంపై జాతీయ సఫాయి కర్మచారి కమిషన్‌కు తాము ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే నేటి వరకు సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాలో మున్సిపల్ స్కావెంజర్స్ యాక్ట్(ఎంఎస్ యాక్ట్)–2013 సరిగా అమలు కావడం లేదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన జిల్లా అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన జాతీయ సఫాయి కర్మచారి సభ్యుడు చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



డాక్టర్ పీపీ వావకు వినతిపత్రం అందజేస్తున్న బాబీభగత్, అమృత్‌కుమార్

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై అవగాహన

నెల్లూరు(సెంట్రల్): జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ద్వారా వాటిని నివారించవచ్చని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా రైల్వేఫీడర్స్ రోడ్డులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను తప్పక వేయించాలని సూచించారు. నగరంలోని వీధి కుక్కల సంరక్షణకు కల్లూరుపల్లిలో ఒక ఆశ్రమాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. అనంతరం జంతు సంరక్షణకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు ఖాదర్‌వలి, సోమయ్య, భాస్కర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు, డాక్టర్లు

ధరల నియంత్రణపై జేసీ సమీక్ష

నెల్లూరు(దర్గామిట్ట): ధరల నియంత్రణపై జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయకుండా, అధిక ధరలకు విక్రయించకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత ధరలకు మాత్రమే నిత్యావసర సరుకులను విక్రయించాలని మిల్లర్లు, వర్తకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకట్రావు, వ్యాపారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేదు మాధవన్

మైపాడురోడ్డు జలమయం

నెల్లూరు(బారకాసు): నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికి మైపాడురోడ్డు జలమయంగా మారింది. మైపాడు రోడ్డు పక్కనే జాఫర్‌సాహెబ్ కాలువ ఉంది. అందులోకి వర్షపు నీరు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో మైపాడురోడ్డుపై నిల్వ చేరింది.. ఈ కారణంగా మైపాడు రోడ్డుపై ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల మైపాడురోడ్డును నాలుగులేన్లుగా విస్తరించారు. సిమెంట్ రోడ్డుపై పడిన వర్షపు నీరు వెళ్లేందుకు సంబంధిత కాంట్రాక్టర్ చర్యలు తీసుకోలేదు. దీంతో చిన్నపాటి చిరుజల్లులకే మైపాడురోడ్డుపై నీరు నిల్వ చేరుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మైపాడురోడ్డులో వర్షపు నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మైపాడురోడ్డుపై నిల్వ చేరిన వర్షపు నీరు

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత

- వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కే సునీత

వెంకటాచలం: ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లను విచక్షణారహితంగా నరికేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ సాయిప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలను విధిగా ప్రదర్శించాలి



ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఈఓ రఘురామయ్య

- డిప్యూటీ ఈఓ రఘురామయ్య

కొడవలూరు: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ఫీజుల వివరాలను విధిగా నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని కావలి డిప్యూటీ ఈఓ రాఘురామయ్య సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో అనుమతి ఉన్న మేరకు మాత్రమే తరగతులను నిర్వహించాలన్నారు. అనుమతి లేకుండా తరగతులను నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు, బెల్టు, తదితరాలను ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలల్లో విక్రయించరాదన్నారు. పాఠశాలల బస్సులు కండీషన్‌లో ఉండేలా చూసుకోవడంతో పాటు ఫిట్‌నెస్ ఉన్న డ్రైవర్‌లనే నియమించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నడుచుకోవాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు వసంతకుమారి, ఎన్ అంకయ్య, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.